# మరో ప్రజా సంకల్పం

మంగళవారం, 13 అక్టోబరు 2026 | Evening News Bulletin | పేజీలు : 6


ప్రతి రోజూ సాయంత్రం మరో ప్రజాసంకల్పం ఈ-పేపర్‌లో వచ్చే సమాచారం కోసం
ఈ QR కోడ్‌ను స్కాన్ చేసి వాట్సాప్ ఛానల్‌లో జాయిన్ అవ్వండి.



# డ్రగ్స్ అడ్డా ఏపీ

## విశాఖ నుంచి విజయవాడ వరకు దమ్ మారో దమ్

## రాష్ట్రాన్ని నల్లమబ్బులా కమ్మేస్తున్న మత్తు

- విచ్చలవిడిగా కొకైన్, గంజాయి, డ్రగ్స్ సరఫరా
- పేట్రేగిపోతున్న బంగారం స్మగ్లింగ్ ముఠాలు
- ఉత్తరాంధ్రలో వరుసగా గంజాయి పట్టుబడుతుంటే ప్రభుత్వం ఏం చేస్తోంది?
- గత నెలలో అనకాపల్లిలో 3 కోట్ల విలువైన గంజాయి పట్టివేత
- తూర్పుగోదావరి జిల్లాలో పోలీసులపై గంజాయి ముఠా దాడి
- విశాఖలో జబర్దస్త్ రేవ్.. మద్యం మత్తులో టీడీపీ నేతల కుమ్ములాట
- కుప్పంలోనూ గంజాయి గుప్పు
- ప్రకాశం జిల్లాలో పోలీసుల కారులోనే గంజాయి, మద్యం
- గంజాయి నిర్మూలిస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు ప్రగల్భాలు
- రెండున్నరేళ్లు గడిచినా నియంత్రణ ఏదీ?
- అక్రమ రవాణాకు గేట్ వేగా మారిపోతున్న ఆంధ్రప్రదేశ్

- మిగతా 2-4 పేజీల్లో..

రాష్ట్రంలో మాదకద్రవ్యాల మహమ్మారి కోరలు చాచుతోంది. విశాఖపట్నం నుంచి విజయవాడ వరకు డ్రగ్స్ సంస్కృతి నల్లమబ్బులా రాష్ట్రంపై కమ్ముకుంటోంది. కొకైన్, గంజాయి, ఇతర సింథటిక్ డ్రగ్స్ విచ్చలవిడిగా సరఫరా అవుతున్నాయి. మరోవైపు బంగారం స్మగ్లింగ్ ముఠాలు పేట్రేగిపోతున్నాయి. ఎన్నికల సమయంలో గంజాయిని పూర్తిగా నిర్మూలిస్తామని చంద్రబాబు చేసిన ప్రగల్భాలు ఆచరణలో నీరుగారిపోతున్నాయి. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా, అక్రమ రవాణాను నియంత్రించడంలో ఘోరంగా విఫలమైంది.

1

12-10-2026 -
బంగారం పట్టివేత

కోల్‌కతా నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారులోని రహస్య అరలో దాచిన రూ.8.98 కోట్ల విలువైన 5.8 కిలోల విదేశీ బంగారాన్ని విశాఖలో డీఆర్ఐ అధికారులు పట్టుకున్నారు.


విశాఖలో భారీగా బంగారం పట్టివేత

- సీసీ కెమెరాలో కారులో ఓ రహస్య అర ఏర్పాటు
- రూ.8.98 కోట్ల విలువైన స్మగ్లింగ్ గోల్డ్ పేస్ట్

2

10-10-2026
38 కిలోల గంజాయి పట్టివేత

డుంబ్రిగుడ మండలంలో ఒడిశా నుంచి తూటంగి మీదుగా మైదాన ప్రాంతానికి ఆటోలో అక్ర మంగా తరలిస్తున్న 38 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు.


38 కిలోల గంజాయి పట్టివేత
ముగ్గురి అరెస్టు

గంజాయి, నిందితులతో పోలీసులు

3

08-10-2026
విశాఖలో డ్రగ్స్ విక్రయం

విశాఖలోని ఈస్ట్ పాయింట్ కాలనీ సమీపంలో కారులో డ్రగ్స్ విక్రయిస్తున్న ముగ్గురు యువకులను టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. పట్టుబడిన వారిని గాజువాక, స్టీల్‌ప్లాం ట్ ప్రాంతాలకు చెందిన పీవీ శివప్రసాద్, ఎ.మధు, విద్యాసాగర్ గా గుర్తించారు. వారి నుంచి 50 గ్రాముల ఎండీఎంఏ, ఒక లీటర్ హాష్ ఆయిల్, కొంత గంజాయి, కారును స్వాధీనం చేసుకు న్నారు.


విశాఖలో డ్రగ్స్ విక్రయం

- 50 గ్రాముల ఎండీఎంఏ, హాష్ ఆయిల్, గంజాయి స్వాధీనం

పట్టుకున్న డ్రగ్స్, హాష్ ఆయిల్

4

04-09-2026
రూ.3 కోట్ల విలువైన గంజాయి పట్టివేత

రూ.3 కోట్ల విలువైన 600 కిలోల గంజాయిని అనకాపల్లి రూరల్ పోలీసులు పట్టుకుని ముగ్గురు అంతర్రాష్ట్ర నిందితులను అరెస్టు చేశారు. వ్యాన్(ఏపీ 39 వీఏ 6786)లో ఉన్న 600 కిలోల గంజాయి, పైలట్ వాహనంగా వాడిన హోండా సివిక్ (ఏపీ 16 బీసీ 0018) కారును స్వాధీనం చేసుకున్నారు.


రూ.3 కోట్ల విలువైన గంజాయి పట్టివేత

600 కిలోల గంజాయి స్వాధీనం • ముగ్గురు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్టు

5

27-08-2026
రిసార్ట్‌లో కత్తిపోట్లు

ఆనందపురం పరిధిలోని హ్యాపీ నేచర్ రిసార్ట్‌లో జరిగిన పుట్టినరోజు వేడుకలో మహిళల విషయమై రెండు వర్గాల మధ్య ఘర్షణ తలెత్తి, టీడీపీ నాయకుడు వెంకట్‌దినేశ్‌ను మరో నాయకుడు చరణ్‌తేజ్ కత్తితో పొడిచాడు


విశాఖలో జబర్దస్త్ రేవ్..
మద్యం మత్తులో టీడీపీ నేతల కుమ్ములాట

- హ్యాపీ నేచర్ రిసార్ట్‌లో జబర్దస్త్ షేమ్ నవ్ ఐడియే దేవతలు
- మహిళల విషయమై రెండువర్గాల ఘర్షణ
- టీడీపీ నాయకుడు వెంకటదినేష్‌ను కత్తితో పొడిచిన మరో నేత చరణ్‌తేజ్
- హత్యాయత్నం కేసు నమోదు

# డ్రగ్స్ అడ్డా ఏపీ!

## రాష్ట్రమంతా మత్తుదందా

విశాఖలో కొకైన్ పట్టుబడుతోంది. ఉత్తరాంధ్రలో క్వింటాళ్ల కొద్దీ గంజాయి స్వాధీనమవుతోంది. కార్లలో రహస్య అరలు ఏర్పాటు చేసి కోట్ల రూపాయల విదేశీ బంగారాన్ని తరలిస్తున్న ఘటనలు వెలుగుచూస్తున్నాయి. మరోవైపు రిసార్ట్‌లలో ఘర్షణలు, కత్తిపోట్లు, మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఒక్క విశాఖకే పరిమితం కాకుండా కడప, తూర్పుగోదావరి, ప్రకాశం, కుప్పం ప్రాంతాల నుంచి కూడా మత్తు పదార్థాలకు సంబంధించిన ఘటనలు వార్తల్లోకి వస్తున్నాయి. రాష్ట్రంలో శాంతిభద్రతలు, మాదకద్రవ్యాల నియంత్రణ వ్యవస్థల పనితీరుపై ఇవన్నీ కీలక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. గంజాయి నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల ముందు చంద్రబాబు ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ప్రభుత్వం మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపుతామని కబుర్లు చెబుతున్నారు. అయితే వరుసగా వెలుగుచూస్తున్న కేసులు వెన్నుపోటుప్రభుత్వ వైఫల్యాన్ని కళ్లకు కడుతున్నాయి. ఎక్కడో ఒకచోట గంజాయి పట్టుకోవడం, కొందరిని అరెస్టు చేయడం వరకే పరిమితమవుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## సీఎం, హోంమంత్రి ఏం చేస్తున్నారు?

యువతను మత్తు పదార్థాల బారినపడకుండా కాపాడటం, విద్యాసంస్థల పరిసరాల్లో నిఘా పెంచడం, అంతర్రాష్ట్ర రవాణా మార్గాలను గుర్తించడం ప్రభుత్వ ప్రధాన బాధ్యతలు. ముఖ్యమంత్రి చంద్రబాబు, హోంమంత్రి వంగలపూడి అనిత ఈ అంశాలపై ఎందుకు పట్టించుకోవడం లేదన్న ప్రశ్నలు వస్తున్నాయి. మత్తు పదార్థాల నియంత్రణలో ప్రభుత్వం ప్రకటించిన లక్ష్యాలకు, క్షేత్రస్థాయి ఫలితాలకు పొంతనే లేదన్న విమర్శలు వస్తున్నాయి.

## అనకాపల్లిలో రూ.3 కోట్ల గంజాయి

గత సెప్టెంబర్‌లో అనకాపల్లి జిల్లాలో జరిగిన భారీ గంజాయి పట్టివేత మత్తు పదార్థాల అక్రమ రవాణా వ్యవస్థను మరోసారి వెలుగులోకి తెచ్చింది. సెప్టెంబర్ 3న అనకాపల్లి మండలం సంపతిపురం జంక్షన్ వద్ద పోలీసులు 600 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ సుమారు రూ.3 కోట్లు. ముగ్గురిని అరెస్టు చేయడంతో పాటు గంజాయి తరలిస్తున్న వ్యాన్, పైలట్ వాహనంగా ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా నుంచి తుని వైపు గంజాయిని తరలిస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. మరికొందరు నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేసులో అరెస్టయిన ఒక నిందితుడికి గతంలోనూ గంజాయి రవాణా కేసుతో సంబంధం ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. జైలులో ఏర్పడిన పరిచయాల ద్వారా మరో సరఫరా వ్యవస్థకు మార్గం ఏర్పడినట్లు వార్తలు వచ్చాయి. అంటే గంజాయి రవాణాలో పాత నేరస్థుల సంబంధాలు, అంతర్రాష్ట్ర ముఠాల పాత్ర ఎంత కీలకమో ఈ ఘటన తెలియజేస్తోంది. ఇలాంటి నెట్‌వర్క్‌లను పూర్తిగా ఛేదించేందుకు ఏ చర్యలు తీసుకున్నారో ప్రభుత్వం వెల్లడించాలి.

## క్వింటాళ్ల గంజాయి.. సరఫరాకు అడ్డేది?

2026 మేలో విశాఖ సమీపంలోని కాపులుప్పాడ వద్ద అధికారులు 2,348 కిలోల గంజాయితో పాటు సుమారు 55 లీటర్ల హషీష్ ఆయిల్‌ను ధ్వంసం చేశారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో గత 18 నెలల్లో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాలివి. వీటి విలువ సుమారు రూ.1.72 కోట్లుగా అంచనా వేశారు. అప్పట్లో అధికారులు అల్లూరి జిల్లాలో గంజాయి సాగు అనవాళ్లు లేవని, ఈ ప్రాంతాలు ప్రధానంగా అక్రమ రవాణా మార్గాలుగా ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. సాగు నియంత్రణలోకి వచ్చిందని అధికారులు చెబుతున్నా ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి తరలింపు కొనసాగుతుంటే రవాణా మార్గాలపై నిఘా ఎంత ప్రభావవంతంగా ఉంది? ఒకవైపు టన్నుల కొద్దీ గంజాయిని ధ్వంసం చేస్తున్నా మరోవైపు కొత్త సరుకు రవాణా అవుతుండటం వెనుక ఉన్న ముఠాలపై సమగ్ర దర్యాప్తు జరగాలి.

## విశాఖలో కొకైన్ కలకలం!

గంజాయితోనే సమస్య ఆగిపోవడం లేదు. విశాఖలో కొకైన్ సరఫరా కేసులు కూడా వెలుగులోకి వచ్చాయి. 2025 జూలై 5న ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో 25 గ్రాముల కొకైన్, రూ.3.60 లక్షల నగదు, వాహనం, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ముగ్గురిని అరెస్టు చేశారు. ఢిల్లీ నుంచి కొకైన్ సరఫరా చేస్తున్న వ్యక్తులతో స్థానికులకు సంబంధాలు ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. విద్యాసంస్థల పరిసరాల్లో ఇలాంటి ఘటన బయటపడటం తీవ్ర ఆందోళనకరం. ఉన్నత చదువుల కోసం వచ్చే విద్యార్థులు, ఉద్యోగాల కోసం నగరానికి చేరుకునే యువత మత్తు పదార్థాల ముఠాల బారినపడకుండా కాపాడాల్సిన అవసరం ఉంది. డ్రగ్స్ సరఫరాదారులను అరెస్టు చేయడంతో పాటు వారి ఆర్థిక మూలాలు, స్థానిక పంపిణీ వ్యవస్థలు, ఇతర రాష్ట్రాలతో సంబంధాలను ఛేదించాలి.

## విజయవాడకూ విస్తరించిన డ్రగ్స్ దందా!

విశాఖతో పాటు విజయవాడలోనూ డ్రగ్స్ సరఫరా వ్యవహారాలు వెలుగుచూశాయి. 2025 జూలైలో బెంగళూరు నుంచి డ్రగ్స్ తీసుకొచ్చి విక్రయిస్తున్న కేసులో ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులతో పాటు మరో యువకుడిని విజయవాడ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఒక నగరం నుంచి మరో నగరానికి మత్తు పదార్థాలు చేరుతున్నట్లు వెల్లడవుతున్న ఇలాంటి కేసులు అంతర్రాష్ట్ర సరఫరా వ్యవస్థలపై సమన్వయంతో దర్యాప్తు చేయాల్సిన అవసరాన్ని తెలియజేస్తున్నాయి. విశాఖలో పట్టుబడిన కొకైన్, విజయవాడలో వెలుగుచూసిన డ్రగ్స్ కేసు వేర్వేరు ఘటనలే అయినప్పటికీ, రెండింటిలోనూ ఇతర రాష్ట్రాల నుంచి సరఫరా అంశం బయటపడింది.

## కారులో రహస్య అర.. రూ.8.98 కోట్ల బంగారం!

విశాఖ మీదుగా సాగుతున్న అక్రమ రవాణాకు తాజా ఉదాహరణ విదేశీ బంగారం పట్టివేత. అక్టోబర్ 8-9 మధ్య రాత్రి కోల్‌కతా నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారును విశాఖ వద్ద డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు వెంబడించి పట్టుకున్నారు. ముందు ప్రయాణికుడి సీటు కింద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రహస్య అరలో 5,832.90 గ్రాముల విదేశీ బంగారాన్ని గుర్తించారు. దీని విలువ రూ.8.98 కోట్లు. ఇద్దరిని అరెస్టు చేశారు. భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు నుంచి ఈ బంగారం అక్రమంగా దేశంలోకి తీసుకొచ్చినట్లు డీఆర్ఐ వెల్లడించింది. ఈ కేసులో డీఆర్ఐ నిఘాతో భారీ అక్రమ రవాణాను అడ్డుకోగలిగింది. అయితే జాతీయ రహదారుల మీదుగా ఇంత పెద్ద మొత్తంలో బంగారాన్ని తరలిస్తున్న ముఠాల మూలాలను గుర్తించడంలో రాష్ట్రప్రభుత్వం ఏం చర్యలు తీసుకుంటోంది? రవాణా మార్గాలు, సరుకు పంపినవారు, అందుకోవాల్సినవారు, ఆర్థిక లావాదేవీలపై దర్యాప్తు ఎంతవరకు పురోగమించిందో ఈ ప్రభుత్వం వెల్లడిస్తుందా?

## జైలులోనే గంజాయి మొక్క!

2025 జనవరిలో విశాఖ కేంద్ర కారాగారంలో గంజాయి మొక్క పెంచుతున్న విషయం బయటపడటం సంచలనం సృష్టించింది. ఖైదీల వద్ద సెల్‌ఫోన్లు లభించిన నేపథ్యంలో జైలును సందర్శించిన హోంమంత్రి అనిత ఈ విషయాన్ని వెల్లడించినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండాల్సిన జైలులోనే గంజాయి మొక్క కనిపించడం పర్యవేక్షణపై ప్రశ్నలను లేవనెత్తింది. ఆ ఘటన తర్వాత బాధ్యులపై తీసుకున్న చర్యలు, జైళ్లలో మత్తు పదార్థాల ప్రవేశాన్ని నిరోధించేందుకు చేపట్టిన సంస్కరణల వివరాలను ప్రభుత్వం వెల్లడించాలి.

రాజమహేంద్రవరంలోని రాజానగరం పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి



## రిసార్ట్‌లో కత్తిపోట్లు.. కలకలం!

విశాఖ జిల్లా ఆనందపురం పరిధిలోని హ్యాపీ నేచర్ రిసార్ట్‌లో 2026 ఆగస్టు 27న వెలుగుచూసిన ఘటన రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. పుట్టినరోజు వేడుక సందర్భంగా టీడీపీ నేతల మధ్య ఘర్షణ జరిగి, వెంకట్ దినేశ్ అనే నాయకుడిపై కత్తితో దాడి జరిగింది. ఈ ఘటనలో హత్యాయత్నం కేసు నమోదైంది. అధికార పార్టీ నాయకులే స్వయంగా పాల్గొడం.. దగ్గరుండి నేరాలను ప్రోత్సహించడం కాదా? ఇక దర్యాప్తు నిష్పక్షపాతంగా ఎలా జరుగుతుంది? ఘర్షణకు దారితీసిన పరిస్థితులు, ఆయుధం వినియోగం, సంబంధిత వ్యక్తుల పాత్రపై పోలీసులు ఏం చర్యలు తీసుకున్నారు? రాజకీయ పలుకుబడితో సంబంధం లేకుండా చట్టం అందరికీ సమానంగా వర్తిస్తుందనే భరోసా కలిగేది ఎలా?

## ఆడబిడ్డలకు రక్షణ ఏదీ?

మత్తు పదార్థాల అక్రమ రవాణాతో పాటు మహిళలు, చిన్నారులపై జరుగుతున్న దాడులు కూడా ఆందోళన కలిగిస్తున్నాయి. 2026 ఫిబ్రవరిలో విశాఖలో మూడేళ్ల చిన్నారిపై లైంగిక దాడి ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు నిందితుడిని అరెస్టు చేసినట్లు వార్తలు వచ్చాయి. మహిళా కమిషన్ కూడా స్పందించింది. చిన్నారుల భద్రతకు పటిష్ఠమైన చర్యలు అవసరమనే విషయాన్ని ఈ ఘటన గుర్తుచేసింది. జూన్‌లో పెందుర్తి పరిధిలో పెళ్లికి నిరాకరించిన మహిళపై ఓ యువకుడు కత్తెరతో దాడి చేసినట్లు వార్తలు వచ్చాయి. అతడిపై గతంలో పోక్సో కేసు ఉంది. బాధితురాలిని మహిళా సంరక్షణ కేంద్రానికి తరలించారు. మహిళలపై బెదిరింపులు, వేధింపుల ఫిర్యాదులకు సకాలంలో స్పందించడం, గతంలో నేరారోపణలు ఎదుర్కొన్నవారి నుంచి ముప్పు ఉన్న బాధితులకు రక్షణ కల్పించడం అత్యంత కీలకం.




మదనపల్లెలో పట్టుబడిన రూ.32 లక్షల విలువైన గంజాయి, కూల్ లిప్స్

# డ్రగ్స్ అడ్డా ఏపీ!

## అరెస్టులతోనే సమస్య పరిష్కారమా?

రాష్ట్రంలో మత్తు పదార్థాల నియంత్రణ కోసం పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. గంజాయి స్వాధీనం చేసుకుంటున్నారు. నిందితులను అరెస్టు చేస్తున్నారు. స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాలను ధ్వంసం చేస్తున్నారు. ఈ చర్యలను గుర్తించాల్సిందే. కానీ పట్టివేతల సంఖ్య ఒక్కటే నియంత్రణకు కొలమానం కాదు. గంజాయి సరఫరా వ్యవస్థలో ప్రధాన సూత్రధారులు ఎంతమంది అరెస్టయ్యారు? ఎన్ని కేసుల్లో నేర నిర్ధారణ జరిగింది? అక్రమ రవాణాదారుల ఆస్తులు ఎంతమేర జప్తు చేశారు? ఇతర రాష్ట్రాల పోలీసులతో కలిసి ఎన్ని నెట్‌వర్క్‌లను ఛేదించారు? మళ్లీ మళ్లీ నేరాలకు పాల్పడుతున్నవారిని అడ్డుకునేందుకు ఏం చేస్తున్నారు? విద్యాసంస్థల్లో డ్రగ్స్ నిరోధక కార్యక్రమాల ఫలితాలేమిటి? ఈ ప్రశ్నలకు సమాధానంగా రాష్ట్రప్రభుత్వం జిల్లా వారీగా గంజాయి, కొకైన్, ఇతర మత్తు పదార్థాల కేసులు, స్వాధీనం చేసుకున్న పరిమాణం, అరెస్టులు, నేర నిర్ధారణలు, అక్రమ ఆస్తుల జప్తు వివరాలతో నివేదిక విడుదల చేయాలి. గత సంవత్సరాలతో పోల్చిన గణాంకాలు కూడా అందుబాటులో ఉంచాలి.

## హామీలకు.. ఫలితాలకు లెక్క చెప్పాలి!

ఎన్నికల ముందు గంజాయి నిర్మూలనపై చంద్రబాబు చేసిన ప్రకటనలను ఇప్పుడు ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు. 2024 జూన్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 2026 అక్టోబర్ నాటికి దాదాపు 28 నెలలు గడిచాయి. ఈ కాలంలో ప్రభుత్వం చేపట్టిన చర్యలు, వాటి ఫలితాలు ఏంటి? గత ప్రభుత్వ హయాంలో గంజాయి సమస్యను ప్రస్తావించిన అధికార పక్షం, ఇప్పుడు తన పాలనలో వెలుగుచూస్తున్న ఘటనలపైనా అదే స్థాయిలో స్పందించాలనే డిమాండ్లు వస్తున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు, హోంమంత్రి అనిత, పోలీసు ఉన్నతాధికారులు జిల్లాలవారీగా డ్రగ్స్ నియంత్రణ ఫలితాలను వెల్లడించాలి. ప్రధాన సరఫరాదారులపై తీసుకున్న చర్యలు, అంతర్రాష్ట్ర ముఠాలపై నమోదైన కేసుల పురోగతి, యువతకు అందిస్తున్న అవగాహన, పునరావాస కార్యక్రమాల వివరాలు ప్రజలకు తెలియాలి.

## మత్తుకు అడ్డుకట్ట ఎప్పుడు?

విశాఖలో కొకైన్.. అనకాపల్లిలో రూ.3 కోట్ల గంజాయి.. విజయవాడలో డ్రగ్స్ సరఫరా కేసు.. జాతీయ రహదారిపై రూ.8.98 కోట్ల విదేశీ బంగారం.. ఇవన్నీ వేర్వేరు ఘటనలే అయినప్పటికీ అక్రమ రవాణా నిరోధక వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తున్నాయి. యువత భవిష్యత్తును కాపాడటం, మహిళలకు భద్రత కల్పించడం, అక్రమ రవాణా ముఠాలను ఛేదించడం ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత. ప్రకటనలతో పాటు గణాంకాలు, దర్యాప్తుల పురోగతి, నేర నిర్ధారణల రూపంలో ఫలితాలు కనిపించాలి. మత్తు ముఠాలకు రాష్ట్రంలో చోటులేదనే భరోసా మాటల్లో కాదు.. ఆచరణలో కనిపించాలి.













































# తెలుగు డ్రగ్స్ పార్టీ!




# చంద్రబాబు అండతోనే అధికారుల బరితెగింపు

- భూమన కరుణాకర్‌రెడ్డి ఫైర్
- తాజాగా 'కుడా' పీడీ వ్యవహారమే ఒక ఉదాహరణ
- తాగి తందనాలాడుతూ పోలీసులపైనే దాడులా!
- బెంగళూరులో ఐఏఎస్ వికాస్ మర్మత్ అనైతిక ప్రవర్తన
- ఆయన్ను కాపాడేందుకు చంద్రబాబు ప్రయత్నం




**తాడేపల్లి:** చంద్రబాబునాయుడి అండదండలు ఉన్నాయన్న ధీమాతోనే రాష్ట్రంలో టీడీపీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో పాటు కేంద్ర సర్వీసుల అధికారులు సైతం అవినీతి, అరాచకాలకు పాల్పడుతూ పక్క రాష్ట్రాల్లో కూడా బరి తెగిస్తున్నారని వైయస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఫైర్ అయ్యారు. సాక్షాత్తు సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న 'కుప్పం ప్రాంత అభివృద్ధి సంస్థ' (కుడా) ప్రాజెక్ట్ డైరెక్టర్ (పీడీ)గా పని చేస్తున్న ఐఏఎస్ అధికారి వికాస్ మర్మత్ బెంగళూరులోని పబ్‌లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ, విచారణకు వచ్చిన పోలీసులు, కస్టమర్లపై దాడికి దిగడమే ఈ ప్రభుత్వ అరాచక పాలనకు ప్రత్యక్ష నిదర్శనమని ఆయన మండిపడ్డారు. తన దోపిడీ కోసం అధికారులను, కార్యకర్తలను విచ్చలవిడిగా వదిలేసిన చంద్రబాబు.. చివరకు అలాంటి సంఘవిద్రోహ ప్రవర్తన కలిగిన అధికారులను కాపాడేందుకు స్వయంగా రంగంలోకి దిగడం దుర్మార్గమని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన భూమన కరుణాకర్‌రెడ్డి ధ్వజమెత్తారు. ప్రెస్‌మీట్‌లో భూమన కరుణాకర్‌రెడ్డి ఇంకా ఏం మాట్లాడారంటే..:

### కుప్పంలో దోపిడీ.. లోకేష్‌కు వాటాలు

ఈ వికాస్ మర్మత్ పెద్ద అవినీతిపరుడు అన్న సంగతి కుప్పంలో చిన్న పిల్లాడిని అడిగినా చెబుతారు. డబ్బులు ఇవ్వకుండా అక్కడ ఏ పనీ జరగదు. కుప్పంలో జరిగే అభివృద్ధి పనులను ఏకపక్షంగా టీడీపీ నేతలకు కట్టబెట్టి అడ్డగోలుగా పర్సంటేజీలు వసూలు చేస్తున్నారు. ఆ కమిషన్లలో సగం పైకి, సగం ఈ అధికారికి వెళ్తోంది. ఆ అవినీతి సొమ్ములో భాగాన్ని లోకేష్‌కి కూడా ముట్టజెబుతున్నాన్న ప్రచారం బహిరంగ రహస్యమే.

### సీఎంఓ అండదండలు.. అవినీతి నెట్‌వర్క్

ఈ అధికారికి సీఎంఓలో చక్రం తిప్పుతున్న మరో అధికారి ప్రద్యుమ్న పూర్తి అండదండలు ఉన్నాయి. వీరిద్దరికీ అవినీతిలో భాగస్వామ్యం ఉండటం వల్లే రాజకీయ నాయకులపై సైతం లెక్కలేనితనం, దురుసుతనం ప్రదర్శిస్తున్నారు. చంద్రబాబు తన ఎమ్మెల్యేలను గానీ, కార్యకర్తలను గానీ కంట్రోల్ చేయలేకపోగా, అధికారులను కూడా అవినీతి ఊబిలోకి దింపి గూండాలుగా మారుస్తున్నారు.

### అధికారిని కాపాడేందుకు సీఎంఓ తీవ్ర ఒత్తిళ్లు

పబ్‌లో అంతటి వికృత చేష్టలకు పాల్పడిన అధికారిని రక్షించేందుకు సాక్షాత్తు ముఖ్యమంత్రే స్వయంగా రంగంలోకి దిగి బెంగళూరు పోలీసులపై ఒత్తిడి తెచ్చినా, ఆ అధికారి విశృంఖలత్వాన్ని చూసి అక్కడి పోలీసులు కేసు నమోదు చేశారు. ఇలాంటి సంఘవిద్రోహ ప్రవర్తన కలిగిన వ్యక్తులకు చంద్రబాబు కీలక పోస్టింగులు ఇచ్చి పెంచి పోషిస్తున్నారు కాబట్టే ప్రజల సొమ్ముతో వీకెండ్లలో పబ్‌లకు వెళ్లి ఎంజాయ్ చేయడం వీరికి అలవాటుగా మారిందని భూమన కరుణాకర్‌రెడ్డి ఆక్షేపించారు.

### చంద్రబాబు పాలనలోనే ఇలాంటి ఘోరాలు

**రాష్ట్రంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలనే కాకుండా ఐఏఎస్ లాంటి ఉన్నత స్థాయి అధికారులను కూడా రౌడీల్లా తయారు చేసిన ఘనత ముమ్మాటికీ చంద్రబాబునాయుడిదే. ఆదర్శప్రాయంగా నిలవాల్సిన కేంద్ర సర్వీసు అధికారులు ఇంత బజారు స్థాయికి దిగజారి గూండాల కంటే హీనంగా ప్రవర్తించడం చంద్రబాబు పాలనలోనే చూస్తున్నాం. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలో పనిచేసే ఒక అధికారి పక్క రాష్ట్రానికి వెళ్లి పబ్‌లో దాడికి దిగడం ఈ ప్రభుత్వ విచ్చలవిడితనానికి అద్దం పడుతోంది. బెంగళూరులోని కామోర్ బార్ అండ్ రెస్టారెంట్ పబ్‌లో మద్యం సేవించి తందనాలాడుతూ, విచారణకు వచ్చిన పోలీసులపై ఐఏఎస్ అధికారి వికాస్ మర్మత్ అత్యంత దురుసుగా ప్రవర్తించడమే కాకుండా చేయి చేసుకోవడం, అసభ్య పదజాలంతో దూషించడం సిగ్గుచేటు. పబ్‌లోని కస్టమర్లపై కూడా దాడికి పాల్పడ్డారు. మన వెనుక చక్రం తిప్పుతున్న చంద్రబాబు ఉన్నాడు, నన్నెవరూ ఏమీ చేయలేరన్నధైర్యం తప్ప ఇంతగా తెగించడానికి మరొకటి కారణం కాదు. చంద్రబాబు ఇస్తున్న అలుసు వల్లే ఈ అరాచకాలు జరుగుతున్నాయి.**



## మ్యానువల్‌గా కుల ధ్రువపత్రాలు ఇవ్వాలి

- మాజీ మంత్రి కన్నబాబు
- ఎస్ఈసీ సమావేశంలో పాల్గొన్న వైయస్ఆర్‌సీపీ నేతలు

**విజయవాడ:** ఎస్ఈసీ కార్యాలయంలో రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. వైయస్ఆర్‌సీపీ నుంచి మాజీ మంత్రి కురసాల కన్నబాబు, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు టీజేఆర్ సుధాకర్ బాబు, కాసు మహేశ్వరరెడ్డి, వైయస్ఆర్‌సీపీ నేత నారాయణమూర్తి హాజరయ్యారు. అనంతరం కన్నబాబు మీడియాతో మాట్లాడుతూ.. ''ఎన్నోసీలు కుల ధ్రువ పత్రాలు ఇవ్వడం లేదు. కుల ధ్రువ పత్రాలు తప్పుల తడకగా ఉన్నాయి. మా దగ్గర ఆధారాలన్నీ ఎస్ఈసీకి ఇచ్చాం.. ఆన్‌లైన్ కాకుండా మ్యానువల్‌గా కుల ధ్రువపత్రాలు ఇవ్వాలని కోరాం. అభ్యర్థి నోడ్యూ సర్టిఫికెట్ తీసుకుంటే సరిపోతుంది.. కానీ మొత్తం తీసుకోవాలని నిబంధన పెడుతున్నారు.. నామినేషన్ వేయకుండా అడ్డుకొనే ప్రయత్నం చేస్తున్నారు'' అని మండిపడ్డారు. ''ఆన్‌లైన్‌లో సభలకు పర్మిషన్ ఇచ్చేవిధంగా అవకాశం ఇవ్వాలి. కౌంటింగ్, పోలింగ్ ప్రాంతాల్లో పారా మిలిటరీ సిబ్బందిని ఉపయోగించాలి. సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసులు అధికార పార్టీకి కొమ్ము కాస్తున్నారు. గిరిజన ప్రాంతాల్లో పోలింగ్ బూత్‌లను దూరంగా మార్చేశారు. పారదర్శకమైన ఎన్నికలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలి. నోటిఫికేషన్ వచ్చిన దగ్గర నుంచి మద్యంపై చర్యలు తీసుకొనే విధంగా ఆదేశాలు ఇవ్వాలని కోరాం'' అని కన్నబాబు తెలిపారు.



## పులివెందుల మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థిగా వైయస్ ప్రమీలమ్మ

- వైయస్ మనోహర్‌రెడ్డి సతీమణి పేరును ప్రకటించిన వైయస్ఆర్‌సీపీ

**వైయస్ఆర్ జిల్లా :** పులివెందుల మున్సిపల్ చైర్‌పర్సన్ పదవికి వైయస్ఆర్‌సీపీ అభ్యర్థిగా వైయస్ మనోహర్‌రెడ్డి సతీమణి వైయస్ ప్రమీలమ్మ పోటీ చేయనున్నట్లు పార్టీ ప్రకటించింది. రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆమె అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయడం స్థానిక రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. వైయస్ఆర్‌సీపీ తరఫున చైర్‌పర్సన్ అభ్యర్థిగా ప్రమీలమ్మ పేరు ప్రకటించడంతో పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.

## తాడిపత్రిలో వైయస్ఆర్‌సీపీ నేతలకు సర్టిఫికెట్ల జారీలో జాప్యం




- స్థానిక ఎన్నికల వేళ రెవెన్యూ అధికారుల తీరుపై ఆందోళన

**అనంతపురం:** స్థానిక సంస్థల ఎన్నికల వేళ తాడిపత్రిలో రెవెన్యూ అధికారుల వ్యవహారశైలి వివాదాస్పదంగా మారింది. వైయస్ఆర్‌సీపీ నాయకులు కుల, పన్ను, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ వాటిని మంజూరు చేయడంలో జాప్యం జరుగుతోందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వైయస్ఆర్‌సీపీ నేతలకు అవసరమైన పత్రాలు అందకపోవడంతో ఎన్నికల్లో నామినేషన్లు దాఖలు చేయడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని పార్టీ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు, తాడిపత్రి తహశీల్దార్‌తో పాటు సంబంధిత అధికారులు అందుబాటులో లేకపోవడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వైయస్ఆర్‌సీపీ నేతలు నామినేషన్లు వేయకుండా అడ్డంకులు సృష్టించేందుకు టీడీపీ కుట్రలకు పాల్పడుతోందని, అందుకు అధికారులు సహకరిస్తున్నారని పార్టీ వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సకాలంలో జారీ చేసి, నామినేషన్ల ప్రక్రియకు ఆటంకాలు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

## నామినేషన్లకు అడ్డంకులు సృష్టిస్తే సహించేది లేదు

- మాజీ మంత్రి కాకాణి
- స్థానిక ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని నెల్లూరు కలెక్టర్‌కు వినతి



**నెల్లూరు:** స్థానిక సంస్థల ఎన్నికలు పారదర్శకంగా, సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ నెల్లూరు జిల్లాకు చెందిన వైయస్ఆర్‌సీపీ ముఖ్య నేతలు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఇతర నిరభ్యంతర పత్రాలు సకాలంలో అందేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కాకాణి మాట్లాడుతూ, స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకతను గుర్తించిన చంద్రబాబు, వైయస్ఆర్‌సీపీ అభ్యర్థులను ఇబ్బంది పెట్టే చర్యలకు దిగుతున్నారని విమర్శించారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఇతర ఎన్‌వోసీలు ఇవ్వకుండా జాప్యం చేస్తూ నామినేషన్లను తిరస్కరించేలా కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. బలమైన అభ్యర్థులను పోటీనుంచి తప్పించేందుకు వివిధ రూపాల్లో ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అభ్యర్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా నామినేషన్లకు అడ్డంకులు సృష్టిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

### ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరగాలి: ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, నెల్లూరులో వైయస్ఆర్‌సీపీ బలమైన శక్తిగా ఉండటంతో కూటమి ప్రభుత్వం భయపడుతోందని వ్యాఖ్యానించారు. వైయస్ఆర్‌సీపీ అభ్యర్థులను ఇబ్బంది పెట్టేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. అర్హతలు, హోదాకు సంబంధించిన అంశాలను ప్రస్తావిస్తూ కార్పొరేషన్ కమిషనర్ వ్యవహార శైలిపైనా ప్రశ్నలు లేవనెత్తారు. ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా, పారదర్శకంగా జరగకపోతే తిరగబడతామని స్పష్టం చేశారు.

### అభ్యర్థులకు పార్టీ అండగా ఉంటుంది: ఆనం విజయ్‌కుమార్

వైయస్ఆర్‌సీపీ మేయర్ అభ్యర్థి ఆనం విజయ్‌కుమార్ మాట్లాడుతూ, ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందించడం ప్రభుత్వ బాధ్యతని పేర్కొన్నారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల్లో పోటీ చేసే వైయస్ఆర్‌సీపీ అభ్యర్థులకు జిల్లా పార్టీ నాయకత్వం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

## బీసీలకు చంద్రబాబు క్షమాపణలు చెప్పాలి

- మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ



**తాడేపల్లి :** బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి, ఆ హామీని నెరవేర్చడంలో విఫలమైన చంద్రబాబు బీసీలకు క్షమాపణలు చెప్పాలని మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ డిమాండ్ చేశారు. వైయస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, బీసీలకు చేసిన అన్యాయాన్ని కప్పిపుచ్చుకునేందుకే రాష్ట్రవ్యాప్తంగా సభలు నిర్వహిస్తూ వైయస్ఆర్‌సీపీపై నిందలు వేస్తున్నారని విమర్శించారు. బీసీ రిజర్వేషన్ల సాధనకు ప్రధాని, కేంద్ర హోంమంత్రితో ఎందుకు చర్చించడం లేదని ప్రశ్నించారు.

### అమరావతిపై ఉన్న శ్రద్ధ బీసీ రిజర్వేషన్లపై ఏదీ?

అమరావతికి చట్టబద్ధత కల్పించేందుకు ప్రయత్నిస్తున్న చంద్రబాబు, బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అదే స్థాయిలో ఎందుకు కృషి చేయడం లేదని వేణుగోపాల కృష్ణ ప్రశ్నించారు. బీసీలకు నిజంగా న్యాయం చేయాలంటే కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని, రాజ్యాంగబద్ధమైన పరిష్కారాల కోసం పోరాడాలని అన్నారు. పార్టీ టికెట్లు ఇవ్వడం వేరు, చట్టబద్ధమైన రిజర్వేషన్లు కల్పించడం వేరని స్పష్టం చేశారు. జీవోలు ఇచ్చినప్పుడు గొప్పలు చెప్పుకోవడం, పాలాభిషేకాలు చేయించుకోవడం కాకుండా, వాటి ద్వారా బీసీలకు న్యాయం జరిగేలా చూడాలని హితవు పలికారు.

### బీసీలకు ఇచ్చిన హామీల అమలేది?

బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 అందిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయడం లేదని వేణుగోపాల కృష్ణ విమర్శించారు. ఆదరణ పథకానికి కేటాయించిన నిధులు, చేసిన ఖర్చుపై ప్రభుత్వం వివరాలు వెల్లడించాలని కోరారు. బీసీ కార్పొరేషన్ల ద్వారా రుణాలు అందిస్తామన్న హామీ ఏమైందని, కుట్టు మిషన్ల కోసం దరఖాస్తు చేసి శిక్షణ పొందిన మహిళలకు ఇప్పటికీ మిషన్లు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సుమారు రూ.9 వేల కోట్లకు చేరాయని పేర్కొంటూ, బీసీ కుటుంబాల విద్యాభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని అన్నారు.

### బీసీలను కులవృత్తులకే పరిమితం చేయాలనుకుంటున్నారా?

బీసీలకు రాజకీయంగా, ఆర్థికంగా అవకాశాలు కల్పించడంలో చంద్రబాబు ప్రభుత్వం విఫలమైందని వేణుగోపాల కృష్ణ విమర్శించారు. బీసీ నాయకులకు పదవులు ఇచ్చి వైఎస్ జగన్‌ను విమర్శించడానికే పరిమితం చేస్తున్నారని అన్నారు. బీసీ మంత్రులు తమ శాఖల ద్వారా ప్రజలకు న్యాయం చేయడంపై దృష్టి పెట్టాలని సూచించారు. బీసీల రాజకీయ సాధికారత కోసం వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వం అనేక పదవుల్లో ప్రాతినిధ్యం కల్పించిందని, చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలనే లక్ష్యంతో ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెట్టిందని గుర్తుచేశారు.

## Social Buzz














# ఉర్సు ఉత్సవాలకు వైయస్ జగన్‌కు ఆహ్వానం

**పార్టీ కేంద్ర కార్యాలయంలో వైయస్ జగన్‌ను కలిసిన కడప అమీన్ పీర్ దర్గా ప్రతినిధులు**

**తాడేపల్లి :** కడప అమీన్ పీర్ దర్గా ఉర్సు ఉత్సవాలకు వైయస్ఆర్‌సీపీ అధ్యక్షుడు,మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిని దర్గా పీఠాధిపతి, ప్రతినిధులు ఆహ్వానించారు.వైయస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయనను కలిసిన దర్గా ప్రతినిధులు, ఈ నెల 24 నుంచి 30 వరకు ఉర్సు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

ఉత్సవాలను ఘనంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని వైయస్ జగన్ సూచించారు. కడప అమీన్ పీర్ దర్గా ఆధ్యాత్మిక విశిష్టతతో పాటు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. అన్ని మతాల ప్రజలు భక్తితో దర్గాను దర్శించుకోవడం, ఉర్సు ఉత్సవాల్లో పాల్గొనడం ఈ పవిత్ర స్థల ప్రత్యేకతను చాటుతోందన్నారు. హిందూ-ముస్లిం ఐక్యత, పరస్పర గౌరవం, సోదరభావం సమాజానికి బలమని వైయస్ జగన్ పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి ఉత్సవాల్లో పాల్గొని మత సామరస్య సందేశాన్ని చాటాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దర్గా పీఠాధిపతి ఖ్వాజా సయ్యద్ షా ఆరిపుల్లా హుస్సేనీ, చీఫ్ ముజావర్ అమీరుద్దిన్, ముజావర్లు వాజిద్ ఖాన్, బాజీ షేక్, రియాజుద్దిన్, పకీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు టీడీపీ చేసిన మోసాలను రాసే దమ్ముందా?

- **ఈనాడుకు ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ ఛాలెంజ్**
- **ఐదేళ్ల పాలనలో జగన్ చేసిన మేలు కనిపించదా?**




**తాడేపల్లి:** బీసీలకు వెన్నుపోటు పొడిచిన పార్టీకి కొమ్ముకాస్తూ, ఇంకోపక్క బీసీలను రాజకీయంగా తిరుగులేని శక్తిగా నిలిపిన వైఎస్సార్సీపీ గురించి 'ఈనాడు' పత్రిక పచ్చి అపద్ధాలతో తప్పుడు కథనాలు ప్రచురిస్తోందని వైఎస్సార్సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్లపై వైకాపా రాజకీయ క్రీడ' అంటూ ఈనాడు రాసిన కథనంపై ఆయన ధ్వజమెత్తారు. వెన్నుపోటు పార్టీ తమ మేనిఫెస్టోలో బీసీ డిక్లరేషన్ పేరుతో 34% రిజర్వేషన్లు ఇస్తామని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చాక మోసం చేసిందని గుర్తు చేశారు. ఇంకా నాడు వైయస్సార్‌సీపీ ప్రభుత్వం జీఓ నెం:176 ద్వారా 34% రిజర్వేషన్లు కల్పిస్తే సీఎం చంద్రబాబు, తన వెన్నుపోటు పార్టీకి చెందిన వ్యక్తి ద్వారా హైకోర్టులో పిటిషన్ వేయించి అడ్డుకుందని గుర్తు చేశారు. ప్రెస్‌మీట్‌లో ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ ఇంకా ఏం మాట్లాడారంటే..

### ఈనాడుకు ఆ ధైర్యం ఉందా?

ఈ రెండున్నర ఏళ్లలో ఈ ప్రభుత్వం బీసీలకు చేసిందేమీ లేదు. అయినా నైతికంగా పూర్తిగా దిగజారిన, జర్నలిజమ్ విలువలకు పూర్తిగా పాతరేసిన ఈనాడు వెన్నుపోటు పార్టీ కూటమి ప్రభుత్వాన్ని నిత్యం జాకీలతో ఎత్తుతోంది. అందుకోసం మా పార్టీపైనా, గత మా ప్రభుత్వంపైనా అడ్డగోలుగా ఆరోపణలు, విమర్శలు చేస్తోంది. మరోవైపు, రాజకీయంగా ఎదుగుతున్న మాజీ మంత్రులు సీదిరి అప్పలరాజు, జోగి రమేష్, విడదల రజిని, తమ్మినేని సీతారాం, కారుమూరి నాగేశ్వరరావు వంటి బీసీ నాయకులపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపుతున్నారు. వారిని ఎదగనీయకుండా వెన్నుపోటు పార్టీ కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. నిజానికి గత మా ప్రభుత్వం బీసీలకు రాజకీయ పరంగా కానీ, పథకాల అమలులో కానీ.. చాలా ప్రాధాన్యం ఇచ్చింది. వివిధ సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ, నాన్ డీబీటీ విధానంలో ఒక్క బీసీల కోసమే చేసిన వ్యయం రూ.1,82,750.71 కోట్లు కాగా, వాటి ద్వారా బీసీలకు అందిన ప్రయోజనాలు అక్షరాలా 5,53,66,581. ఈ స్థాయిలో గతంలో ఏనాడైనా, చంద్రబాబు తాను పదవిలో ఉన్నప్పుడు అప్పుడైనా, ఇప్పుడైనా బీసీలకు ప్రయోజనాలు అందించారా?. అలాగే రాజకీయ పదవుల్లో కూడా నాడు బీసీలకు అత్యధిక ప్రాధాన్యం దక్కింది. అవన్నీ రాసే ధైర్యం ఇదే ఈనాడుకు ఉందా?.

### ఈ అంశాలపై టీడీపీని ప్రశ్నించే దమ్ముందా?

బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయని ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన బాధ్యత కూడా మీకుంటుంది. 2024 ఎన్నికల సమయంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని వెన్నుపోటు పార్టీ ఇచ్చిన హామీని ఇప్పుడు ఏ విధంగా అమలు చేస్తున్నారో ఇదే ఈనాడు ప్రశ్నించగలదా? బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం, సంక్షేమ పథకాలు, విద్య, ఆర్థిక భరోసా విషయంలో కూటమి ప్రభుత్వం సాధించిన పురోగతి ఏమిటో ప్రజలకు వివరించగలదా? బీసీ కులాల అభివృద్ధి కోసం వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్పొరేషన్లు, కల్పించిన పదవులు, అమలు చేసిన పథకాలపై సమగ్ర కథనాలు ప్రచురించగలదా?

### జగన్ పాలనలో బీసీలకు సాధికారత

జగన్‌గారు తమ ప్రభుత్వంలో కేవలం మాటల్లో కాకుండా అన్నీ చేతల్లో చూపారు. రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అత్యున్నత ప్రాధాన్యతను అందించారు. గత వైయస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో 25 ఎంపీ స్థానాలకు గాను 11 స్థానాలు (44%), రాజ్యసభలో నలుగురు సభ్యులు, మరియు 58 ఎమ్మెల్సీలలో 28 మందికి పైగా స్థానాలు కేటాయించి బీసీలకు చట్టసభలలో సముచిత స్థానం కల్పించారు. జెడ్పీ చైర్మన్లు, మేయర్లు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్ స్థానాలలో 36 నుండి 46 శాతానికి పైగా పదవులను బీసీలకే కేటాయించారు. విద్య, వైద్యం, సంక్షేమ పథకాల ద్వారా ప్రతి పేద బీసీ కుటుంబానికి వైఎస్ జగన్ అండగా నిలిచారు.



# కార్యకర్తలకు గౌరవం పెంచేందుకే పార్టీ గుర్తింపు కార్డులు

- **అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి**

**అనంతపురం:** పార్టీలో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు తగిన గౌరవం కల్పించడమే లక్ష్యంగా గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్నామని వైయస్ఆర్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. అనంతపురం అర్బన్ పరిధిలోని రాజీవ్ కాలనీలో నిర్వహించిన పార్టీ గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన నాయకులకు కార్డులు అందజేశారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తను గుర్తించి గౌరవిస్తామని అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. కార్యకర్తలు ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.5 లక్షల బీమా సాయం అందించే సదుపాయం కల్పించామని చెప్పారు.

### సంక్షేమ పథకాలతో ప్రజలకు మేలు

వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు మేలు చేశామని అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. అయితే చేసిన మంచిని ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లలేకపోయామని అన్నారు. మహిళా సంఘాలకు రూ.24 వేల కోట్ల రుణమాఫీ చేశామని, వైఎస్సార్ చేయూత ద్వారా అర్హులైన మహిళలకు ఏటా రూ.18,750 చొప్పున ఆర్థిక సాయం అందించామని వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు దానిని పట్టించుకోవడం లేదని అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కొత్త పింఛన్ల పేరుతో హడావుడి చేస్తున్నారని అన్నారు.

### కూటమి పాలనపై ప్రజల్లోకి వెళ్లాలి

జిల్లా కేంద్రంలో కూటమి ప్రజాప్రతినిధుల దోపిడీ గురించి వారి పార్టీ నాయకులే బయటకు వచ్చి మాట్లాడే పరిస్థితి ఉందని అనంత వెంకటరామిరెడ్డి వ్యాఖ్యానించారు. స్థానిక ఎన్నికల్లో కూటమి కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లి, వైయస్ఆర్‌సీపీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

రానున్న స్థానిక ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు వ్యక్తిగత భేదాభిప్రాయాలను పక్కనపెట్టి ఐకమత్యంతో పనిచేయాలని అనంత వెంకటరామిరెడ్డి సూచించారు. పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైయస్ఆర్‌సీపీ నగర అధ్యక్షుడు చింతా సోమశేఖర్‌రెడ్డి, నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, జూనీ, వెన్నం శివారెడ్డి, మల్లెల వేణు, శ్రీనివాసులు, అంజి, రహీం, హాజీరాబీ, శ్రీరాములు, రంగయ్య, ఓబులేషు, సురేంద్ర, రాజేషు, భాష, తిమ్మరాజు, నాగేంద్ర, హరి, హనుమ, కొనకొండ్ల సంధ్య, లీలమ్మ, లక్ష్మీనరసమ్మ, జగదీష్, బిస్మిల్లా తదితరులు పాల్గొన్నారు.

# ఫ్లైఓవర్ నిర్మాణం పేరుతో దర్గాను తొలగించవద్దు..

- **జిల్లా కలెక్టర్‌కు వైయస్ఆర్‌సీపీ నేత షేక్ నూరి ఫాతిమా వినతి**



**గుంటూరు:** మంగళగిరిలో సుమారు 200 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ హజరత్ సయ్యద్ మాలిక్ హుస్సేన్ ఔలియా దర్గాను ప్రతిపాదిత ఫ్లైఓవర్ నిర్మాణం కోసం తొలగించే ప్రయత్నాలను నిలిపివేయాలని కోరుతూ వైయస్ఆర్‌సీపీ నేతలు గుంటూరు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వైయస్ఆర్‌సీపీ గుంటూరు నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా కలెక్టర్‌ను కలిసి దర్గా ప్రాధాన్యతను వివరించి, దాని తొలగింపు ప్రయత్నాలను ఆపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పురాతన దర్గాను పరిరక్షిస్తూ సమస్యకు పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆఫీజ్ ఖాన్, రాష్ట్ర మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఖాదర్ బాషా, గుంటూరు జిల్లా మైనారిటీ అధ్యక్షుడు సైదా ఖాన్‌తో పాటు గుంటూరు, మంగళగిరి నియోజకవర్గాలకు చెందిన మైనారిటీ నాయకులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పేదల ఇళ్ల కూల్చివేతపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

- **మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి**



**శ్రీకాళహస్తి:** శ్రీకాళహస్తినియోజకవర్గపరిధిలో పేద కుటుంబాలపై అక్రమాలకు పాల్పడితే ఎవరినీ విడిచిపెట్టేది లేదని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. రేణిగుంట మండలం కరకంబాడి రెవెన్యూ పరిధిలోని రామకృష్ణాపురంలో నాలుగు దశాబ్దాలుగా నివాసముంటున్న నిరుపేద కుటుంబాల ఇళ్లను రోడ్డు విస్తరణ పేరుతో ముందస్తు నోటీసులు ఇవ్వకుండా కూల్చివేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కాళ్లు లేని దివ్యాంగుడిని, మహిళలను బూట్లతో తన్ని, జుట్టు పట్టుకుని రోడ్డుపై ఈడ్చుకెళ్లడం అత్యంత అమానుషమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### వ్యక్తిగత కక్షలతోనే పేదలపై ప్రతాపమా?

స్థానిక టీడీపీ బూత్ కమిటీ నాయకుడు మునికృష్ణ వ్యక్తిగత కక్షలతో, కార్ పార్కింగ్, భూ ఆక్రమణల ఉద్దేశంతో పోలీసులను, రెవెన్యూ అధికారులను అడ్డం పెట్టుకుని ఈ చర్యలకు పాల్పడ్డారని బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. పేదల ఇళ్లను నేలమట్టం చేసిన వారితో పాటు ఈ ఘటనకు సహకరించిన అధికారులపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్పీ, జిల్లా కలెక్టర్, ఆర్డీవో స్పందించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

### న్యాయం జరిగే వరకు పోరాటం

బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు వైయస్ఆర్‌సీపీ అండగా ఉంటుందని బియ్యపు మధుసూదన్‌రెడ్డి స్పష్టం చేశారు. బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున మహాధర్నా నిర్వహించడంతో పాటు న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే సుప్రీంకోర్టు వరకు వెళ్తామని పేర్కొన్నారు. పేదలపై ఇలాంటి వేధింపులకు పాల్పడితే భవిష్యత్తులో ఎవరినీ వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, మండల అధ్యక్షుడు గంగారి రమేష్, రహీం, దయాకర్‌రెడ్డి, యోగేశ్వర్‌రెడ్డి, రేణిగుంట మాజీ సర్పంచ్ నగేష్, మాజీ సర్పంచ్ మునిశేఖర్, అస్సన్ సాహెబ్, జాన్‌బాబు, ఖాదర్, గుణశేఖర్, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.